నిర్మించినా.. నిరుపయోగమే

- తాళం తీయని గ్రంథాలయం..
- పాఠకుల ఎదురుచూపులు
- రూ.60 లక్షలతో నూతన భవనం నిర్మాణం



కోరుట్లలో నిర్మించిన నూతన గ్రంథాలయ భవనం

కోరుట్లటౌన్: దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించ లేదన్న చందంగా మారింది కోరుట్ల పట్టణ నిరుద్యోగుల పరిస్థితి. పాఠకులకు విజ్ఞానాన్ని అందించేందుకు నిర్మించిన గ్రంథాలయం నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.60 లక్షలతో పట్టణంలోని జవహర్‌రోడ్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ శాఖ గ్రంథాలయం నిర్మాణం పూర్తయినా నిరుపయోగంగా మారింది. తాళం తీసి పాఠకులకు అందుబాటులోకి తీసుకరావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పూర్తి కాని ప్రహరీ నిర్మాణం

నూతన గ్రంథాలయ భవనం చుట్టూ ప్రహరీ నిర్మాణం పూర్తి కాలేదు. గ్రంథాలయంలో లైబ్రేరియన్‌తోపాటు పూర్తిస్థాయి సిబ్బందిని నియమించి, పుస్తకాలు, పత్రికలు, పరీక్షల మెటీరియల్స్ ఏర్పాటు చేసి, గ్రంథాలయంను సంబంధిత నిర్వహణ అధికారులకు బాధ్యతలు ఇవ్వాల్సి ఉంది. అధికారుల నిర్లక్ష్యంతో నూతన గ్రంథాలయ భవనం అందుబాటులోకి రావడంలేదన్న అభిప్రాయాలు నెలకొన్నాయి. గ్రంథాలయ భవనం అందుబాటులోకి రాకపోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదని పాఠకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా లైబ్రరీ భవనంలో అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసి, వెంటనే ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలని పాఠకులు ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులోకి తీసుకరావాలి



ప్రభుత్వ శాఖ గ్రంథాలయ భవనం అందుబాటులోకి తీసుకరావాలి. ఉద్యోగ నోటిఫికేషన్లు రానున్న తరుణంలో వెంటనే గ్రంథాలయం ప్రారంభిస్తే నిరుద్యోగులకు ఉపయోగంగా ఉంటుంది. లైబ్రరీ భవనంలో టాయిలెట్స్, పార్కింగ్, ప్రహరీ నిర్మించాలి. అన్ని సౌకర్యాలు కల్పించి, సిబ్బందిని నియమించి పాఠకులకు అందుబాటులోకి తీసుకురావాలి.

– వాసం అజయ్, కోరుట్ల

ప్రారంభించేందుకు చర్యలు



ప్రభుత్వ శాఖ నూతన గ్రంథాలయం భవనం నిర్మాణానికి రూ.60 లక్షలు మంజూరు అయ్యాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు పనులు పర్యవేక్షించారు. నిర్మాణం పూర్తయింది. ఇంకా కొన్ని పనులు మిగిలి ఉన్నాయి. ప్రహరీ నిర్మాణం పెండింగ్‌లో ఉంది. మిగతా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకవచ్చేందుకు అవసరమైన చర్యలు చేపడతాం.

– టి. రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్, కోరుట్ల

బతికున్న మనిషిని చంపేశారు..



రైతు చనిపోయినట్లు చూపుతున్న వివరాలు

సారంగాపూర్: అధికారుల అలసత్వంతో ఓ రైతు బతికుండగానే చనిపోయినట్లుగా రికార్డుల్లో నమోదైంది. బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి చెందిన కొండ మల్లేశంకు మండలంలోని మోతీనగర్ శివారుల్లోని వ్యవసాయ భూమి ఉంది. దీనిపై బీర్‌పూర్ సొసైటీలో 2018లో రూ.75 వేలు పంట రుణం తీసుకున్నాడు. ప్రతీ ఆరు నెలలకోకసారి వడ్డీ కడుతూ వస్తున్నాడు. గత ప్రభుత్వ హయాంలో రూ.1 లక్ష లోపు రుణమాఫీ వర్తించాల్సి ఉండగా, మల్లేశంకు రుణమాఫీ కాలేదు. దీనిపై సంబంధిత అధికారులను సంప్రదించగా, నువ్వు చనిపోయినట్లు డాటా ఎంట్రీ అయ్యిందని, ఈ కారణంతో రుణమాఫీ కాలేదని పేర్కొన్నారు. తాను బతికుండగా చనిపోయినట్లు ఎలా ఎంట్రీ చేస్తారని ప్రశ్నిస్తే అధికారులు సరైన సమాధానం ఇవ్వలేదని మల్లేశం తెలిపారు. నిబంధనల ప్రకారం రుణపరిమితిని పెంచడంతో 2023లో తన రుణాన్ని రూ. 1,50,000 పెంచారు. ఈ రుణం తనకు చెల్లించే సమయంలో వాటా ధనం కిందా రూ. 17,500 సంఘం అధికారులు కట్ చేశారని, ప్రస్తుతం రుణంపై వడ్డీ కట్టాలని అధికారులు నన్ను అడుతున్నారని, తాను చనిపోయినట్లు డాటా ఎంట్రీ చేసి, ఇప్పుడు వడ్డీ కట్టాలని అంటే ఎలా కడతానని ప్రశ్నించాడు. వడ్డీ కట్టకపోతే సహకార చట్టం 71 కింద నోటీసులు ఇస్తామని బెదిరిస్తున్నారని తెలిపాడు. దీనిపై ఉన్నతాధికారులు న్యాయం చేయాలని రైతు మల్లేశం కోరుతున్నాడు.

తాత్కాలిక సంతోషాల కోసం వ్యసనాలకు బానిస కావొద్దు


మాట్లాడుతున్న ట్రైనర్ రమేశ్

ధర్మపురి: విద్యార్థులు తాత్కాలిక సంతోషాల కోసం చెడు వ్యసనాలకు బానిస కావొద్దని ఇంపాక్ట్ ట్రైనర్, సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ అన్నారు. ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంపాక్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో చదువుకుని ఉన్నత విజయాలు సాధించిన వారు చాలా మంది ఉన్నారని పేదరికం చదువుకు అడ్డు కాలేదని సూచించారు. కొందరు విద్యార్థులు మద్యం, మత్తు పదార్థాలకు బానిసై బంగారు జీవితాలను పాడు చేసుకుంటున్నారని ఎట్టి పరిస్థితుల్లో చెడు మార్గాల వైపు వెళ్లకూడదన్నారు. ఉన్నత చదువుల కోసం ఆర్థికంగా ఇబ్బంది పడితే దాతలతో పేద విద్యార్థులకు సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జీవన్‌రెడ్డిని కలిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ


ఎమ్మెల్సీతో మాట్లాడుతున్న రఘోత్తంరెడ్డి

జగిత్యాల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తన కుమారుడి వివాహానికి హాజరు కావాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కోరారు. ఆయన వెంట పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, ఆనందరావు ఉన్నారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తిచేయాలి


అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

మల్లాపూర్: గ్రామాల్లో ఉపాధి హామీలో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో రాజ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మొగిలిపేట గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద చేపడుతున్న పనులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, లేని ఎడల చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో సతీశ్, సర్పంచ్ వనతడుపుల నాగరాజు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు ప్రజలకు వివరించాలి


మాట్లాడుతున్న రంజిత్ మోహన్

కోరుట్ల: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించేందుకు బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర నాయకుడు రంజిత్ మోహన్, జిల్లా అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారాయణ అన్నారు. పట్టణంలో శనివారం 'గావ్ చలో బస్తీ చలో అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. అభివృద్ధిని ప్రజలకు వివరించి 2024 లోక్ సభ ఎన్నికల్లో ప్రజల మద్దతు కూడగట్టి రాష్ట్రంలో బీజేపీకి అత్యధిక స్థానాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పీసరి నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాగిల్ల సత్యం, యాదగిరి బాబు, పట్టణ అధ్యక్షుడు బింగి రాజేశ్, మండల, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు అధ్యాపకుల సన్మానం


ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంజీవ్ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా స్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్‌గా కలెక్టర్ యాస్మిన్ భాషా చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో ఆయనను అధ్యాపకులు, విద్యార్థులు సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

30న మెట్‌పల్లిలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

మెట్‌పల్లి: పట్టణంలోని మినీ స్టేడియంలో ఈ నెల 30న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి శనివారం తెలిపారు. భద్రాది కొత్తగూడెంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా టీంను ఎంపిక చేయడానికి ఈ పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అండర్–10,12,14 విభాగాల్లో వివిధ పోటీలు ఉంటాయని, ఆసక్తి గల విద్యార్థులు ఉదయం 9 గంటలకు హాజరు కావాలని ఆయన సూచించారు.

కేసీఆర్ హయాంలో యూరియా కొరత లేదు

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


అయోధ్యలో గోదాం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రాయికల్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయాలతోనే నేడు రాష్ట్రంలో యూరియా కొరత లేదని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని అయోధ్య సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన 300 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదామును శనివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ నిర్ణయాలతో రాష్ట్రంలో నేడు ఎరువుల కొరత లేదని, అదేవిధంగా గ్రామాల్లో చెక్ డ్యామ్‌లు నిర్మించి చివరి ఆయకట్టు వరకు పంటలు సాగు చేశారని, తద్వారా రైతులు ఆర్థికంగా వృద్ధి చెందారని గుర్తుచేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, సింగిల్ విండో చైర్మన్లు రాజలింగం, ఏనుగు మల్లారెడ్డి, దీటి రాజిరెడ్డి, ముత్యంరెడ్డి, సర్పంచ్ జీవన్‌రెడ్డి, ఎంపీటీసీ భారతి, ఉపసర్పంచ్ ఏనుగు రవీందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలకు ఉపాధి ఎంతో అవసరం

జగిత్యాల: ప్రస్తుత కాలంలో మహిళలకు ఉపాధి ఎంతో అవసరమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం వాల్మీకి ఆవాసం సేవ భారతి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టుమిషన్ల శిక్షణ ధ్రువపత్రాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే సతీమణి రాధికను వారు సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు టీవీ.సూర్యం, అశోక్‌రావు, పురుషోత్తం,ధనుంజయ్,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రిక అందజేత

జగిత్యాలరూరల్: మండలంలోని చల్‌గల్‌లో ఫిబ్రవరి 6 నుంచి నిర్వహించే రేణుకా ఎల్లమ్మతల్లి పట్నాలు, బోనాల జాతరకు రావాలని శనివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు గౌడ సంఘం నాయకులు ఆహ్వాన పత్రిక అందజేశారు.

మండల స్థాయి చెకుముకి సైన్స్ పరీక్ష


అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కథలాపూర్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కథలాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో శనివారం మండల స్థాయి చెకుముకి సైన్స్‌పరీక్ష నిర్వహించారు. విద్యార్థుల్లో అజ్ఞానాన్ని తగ్గించి విజ్ఞానాన్ని పెంచేందుకు ఈ పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ పరీక్షల్లో 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మండలస్థాయి ప్రథమ బహుమతి వైష్ణవి, రిషిత, ఆదిత్య టీం సభ్యులు అందుకున్నారు. ఇందులో ప్రతిభ చాటిన విద్యార్థులు వచ్చే నెల 2న జిల్లాస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఆనందరావు, పరీక్షల నిర్వాహణ బాధ్యుడు ఎం.డీ ఖలీద్‌పాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పరీక్షకు ఎంపిక


విద్యార్థినికి ప్రశంసాపత్రం ఇస్తున్న టీచర్లు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని జి. మహాలక్ష్మి చెకుముకి టాలెంట్ పరీక్షలో జిల్లా స్థాయి పరీక్షకు ఎంపికైంది. శనివారం మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ పరీక్షలో 10వ తరగతి విద్యార్థిని జి.మహాలక్ష్మి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా మహాలక్ష్మికి ప్రశంసాపత్రం అందజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్సై సతీశ్

మెట్‌పల్లి: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై చిరంజీవి అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలను నడపవద్దన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఇతర అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు.

అజాగ్రత్తగా వాహనాలు నడపొద్దు

కోరుట్ల: విద్యార్థులు వాహనాలు నడిపేటప్పుడు అజాగ్రత్తగా నడపొద్దని ఎస్సై కిరణ్ కుమార్ అన్నారు. పట్టణంలోని పీఆర్‌బీఎం జూనియర్ కళాశాలలో శనివారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పోతని ప్రవీణ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

సారంగాపూర్: లైసెన్స్ లేకుండా, హెల్మెట్ ధరించకుండా రోడ్డుపై వాహనాలు నడపొద్దని ఎస్సై తిరుపతి అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రోడ్డు సెఫ్టీపై విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, లైసెన్స్, వాహనానికి తగిన ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మచ్చ శంకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

పెగడపల్లి: ట్రాఫిక్, రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఎస్సై సతీశ్ అన్నారు. పెగడపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్ర వాహనాలు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఎస్సై ప్రతిజ్ఞ చేయించారు. హెచ్‌ఎం లలిత, పీసీ సంపత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో నూతన ఆవిష్కరణలకు నాంది

మల్లాపూర్: విద్యార్థుల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు గొప్ప ఆవిష్కరణలకు నాంది పలుకుతాయని స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంఆర్సీలో శనివారం చెక్‌ముకి మండలస్థాయి ప్రతిభ పరీక్షలు నిర్వహించి విజేతలను ప్రకటించారు. అనంతరం మండలస్థాయిలో ప్రథమస్థానంలో టీఎస్ మోడల్ స్కూల్, ద్వితీయ స్థానంలో జెడ్పీ హైస్కూల్ మొగిలిపేట నిలిచారన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక మండల కో–ఆర్డినేటర్లు బందర కంటి శ్రీనివాస్, నల్ల పురుషోత్తం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గం

ధర్మపురి: మండల మున్నూరుకాపు ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బక్కశెట్టి మల్లేశం, మండల అధ్యక్షుడిగా శీలం రాజేశ్, ప్రధాన కార్యదర్శిగా అయ్యోరి వినోద్‌కుమార్, ఉపాధ్యక్షులుగా చల్ల గంగన్న, పులిశెట్టి సురేశ్, కోశాధికారిగా బుక్క మహేశ్, సంయుక్త కార్యదర్శిగా బి. రాజేశ్, ప్రచార కార్యదర్శిగా రవీందర్, కార్యదర్శులుగా గంగాధర్, సతీశ్, సలహాదారులుగా చల్లా జనార్దన్, ముత్తినేని సత్తన్న, బండి మహేశ్, కొశెట్టి రమేశ్‌ను ఎన్నుకున్నారు.

వ్యక్తిగత ఆదాయ పన్ను మినహాయింపు పరిమితి పెంచాలి

కోరుట్ల: కేంద్ర ప్రభుత్వం రాబోయే బడ్జెట్ లో వ్యక్తిగత ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని ఐదు లక్షలకు పెంచాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ రావికంటి పవన్ కుమార్ కోరారు. కోరుట్లలో మాట్లాడుతూ పెరుగుతున్న జీవన వ్యయం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం కోసం ప్రామాణిక మినహాయింపు పరిమితి రెట్టింపు చేయాలన్నారు. కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు తుంగరి నరేశ్, తుర్రం శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలప్పుడే రాజకీయాలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొండగట్టు: ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలని పార్టీలకు అతీతంగా అభివృద్ధికి సహకరిస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం అన్నారు.కొడిమ్యాలలో ఎంపీపీ మేనేని స్వర్ణలత అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి హాజరై మాట్లాడారు. 24 గంటల్లోగా ఎల్లంపెల్లి నీళ్లు కొడిమ్యాల మండలానికి వస్తాయన్నారు. సర్పంచులకు బిల్లులు మంజూరు అయ్యేలా కృషి చేస్తామన్నారు. కొడిమ్యాలలో సహకార సంఘ భవనాన్ని కేడీసీసీబీ అధ్యక్షుడు కొండూరి రవీందర్‌రావుతో కలిసి ప్రారంభించారు. నాచుపెల్లిలో ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్మించిన దుకాణాల సముదాయాన్ని ప్రారంభించారు.తిప్పయ్యపల్లిలో గోదాములకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రశాంతి, ప్యాక్స్ చైర్మెన్ రాజనర్సింగరావు, నాయకులు కృష్ణారావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

జెడ్పీటీసీకి పలువురు పరామర్శ

ఇబ్రహీంపట్నం: మండల జెడ్పీటీసీ భారతిని మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, కాంగ్రెస్ సీనియర్ నేత కృష్ణారావు వేర్వేరుగా శనివారం పరామర్శించారు. జెడ్పీటీసీ భారతి మామ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. దీంతో జెడ్పీటీసీని వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పరామర్శించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మల్లాపూర్: మండలంలోని ముత్యంపేటకు చెందిన లింగంపెల్లి గంగనర్సయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతుండగా, బాధిత కుటుంబానికి బీజేపీ నాయకులు శనివారం రూ.5 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో మోడల్‌స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన చెకుముకి పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు మండల కన్వీనర్ శివకృష్ణ తెలిపారు. మోడల్‌స్కూల్‌లో చదువుతున్న వైష్ణవి, హరిణి, నచికేత్ ప్రథమ స్థానం దక్కించుకున్నారన్నారు. వీరిని హెచ్‌ఎం నవీన్ అభినందించారు.

ఇంటింటా అయోధ్య రామమందిర చిత్రపటాలు పంపిణీ

కథలాపూర్: మండలంలోని సిరికొండలో అయోధ్య రామమందిరం ఫొటోలను బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో శనివారం ఇంటింటా పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, బద్రి సత్యం, మల్యాల మారుతి, కాసోజి ప్రతాప్, తెడ్డు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

రాయికల్: మండలంలోని ఇటిక్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సాయప్ప చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్ హిమవంతరావు సుమారు రూ.30 వేల విలువ గల కంప్యూటర్‌ను బహూకరించారు. శనివారం హెచ్‌ఎం సదాశివ్‌కు మాజీ సర్పంచ్ నీరటి శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొల్లూరి వేణు, చంద్రకంటి రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

21 గ్రామాల్లో పశువైద్య శిబిరాలు

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని సారంగాపూర్, జగిత్యాల రూరల్, గొల్లపల్లి, మేడిపల్లి, మల్లాపూర్, మల్యాల మండలాల్లోని 21 గ్రామాల్లో కోరుట్ల వెటర్నరీ కళాశాల విద్యార్థులు పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా పశువైద్యశాఖ ప్రకటించింది. ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా ఫిబ్రవరి 1 నుంచి 7 వరకు జిల్లా పశువైద్య సిబ్బంది సహకారంతో ఈ శిబిరాలు నిర్వహిస్తారని, ఫిబ్రవరి 1న జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషాతో పాటు వెటర్నరీ యూనివర్శిటీ డీన్ డాక్టర్ రఘునందన్ ప్రారంభిస్తారని, ఈ శిబిరాలను రైతులు ఉపయోగించుకోవాలని కోరారు.

తహసీల్దార్‌కు సన్మానం

రాయికల్: మండల తహసీల్దార్ ఖయ్యూం కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ తహసీల్దార్‌గా అవార్డు అందుకోగా, శనివారం రాయికల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఆదిరెడ్డి, జెడ్పీ కాటిపల్లి రాంరెడ్డి, కోశాధికారి గంట్యాల ప్రవీణ్, లయన్స్‌క్లబ్ సభ్యులు మచ్చ శేఖర్, కడకుంట్ల నరేశ్, బొమ్మకంటి నవీన్, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

పాటిమీది తండాలో ఉచిత వైద్య శిబిరం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం పాటిమీదితండా గ్రామంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పద్మపాణి సొసైటీ కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు చేసి మందులు అందజేశారు. మొత్తం 50 మందికి పైగా వైద్య శిబిరానికి తరలివచ్చినట్లు సొసైటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి, సర్పంచ్ బుజ్జి, పద్మపాణి సొసైటీ సూపర్‌వైజర్ సుదర్శన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుస్తాపూర్ పాఠశాలలో నో బ్యాగ్ డే

మల్లాపూర్: మండలంలోని కుస్తాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డేని పురస్కరించుకుని ఉపాధ్యాయులు, విద్యార్థులతో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ముందుగా గ్రామపంచాయతీని సందర్శించి సర్పంచ్, ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యులతో పాటు, పంచాయతీ కార్యదర్శి, ఇతర సిబ్బంది వివరాలు, వారి విధులు, అందించే సేవలపై అవగాహన కల్పించారు. పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న నర్సరీని సందర్శించి వివిధ మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నునావత్ రాజు మాట్లాడుతూ క్షేత్రస్థాయి పర్యటనలో విద్యార్థులకు ఇంకుడుగుంతలు, వాటి ఏర్పాటు విధానాలపై అవగాహన కల్పించామన్నారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళి, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి 'జువ్వాడి' పరామర్శ

మల్లాపూర్: మండల కేంద్రానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు రుద్ర రాంప్రసాద్ తండ్రి బుచ్చిరాజం అనారోగ్యంతో మృతి చెందగా, శనివారం ధర్మపురి ఆలయ కమిటీ మాజీ చైర్మన్, పీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పర్యటించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రుద్ర బుచ్చిరాజం మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి అంతమయాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఎల్లాల జలపతిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గ్రామ సభ ఏర్పాటు చేయాలని వినతి

ధర్మపురి: బుగ్గారం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభను ఏర్పాటు చేయాలని కోరుతూ మండల పరిషత్ అధికారి అఫ్జల్ మియాను ప్రముఖ ఉద్యమ కారుడు, బీడీసీ కోర్ కమిటీ చైర్మన్ చుక్క గంగారెడ్డి కోరుతూ ఎంపీవోకు శనివారం వినతి పత్రం అందజేశారు. అక్టోబర్ 9న గ్రామస్తులు మండల పరిషత్ కార్యాలయంలో అభ్యర్థన పత్రం అందజేసి గ్రామసభను ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ఫిబ్రవరి1 తో సర్పంచుల పదవీకాలం ముగియనున్నందున పంచాయతీ కార్యదర్శి నరేందర్‌ను పలుమార్లు సంప్రదించినప్పటికీ, గ్రామసభ నిర్వహించకపోవడం బాధాకరమని శనివారం మరోసారి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

కేశవరావు కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మల్యాల: మండలంలోని నూకపల్లి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు బండారి కేశవరావు కుటుంబాన్ని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. శనివారం కేశవరావు చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ బండారి కమలాకర్‌రావు, జెడ్పీటీసీ కొండపల్కల రాంమోహన్‌రావు తదితరులు ఉన్నారు.

కంప్యూటర్ శిక్షణ సర్టిఫికెట్ల అందజేత


సర్టిఫికెట్స్ పొందిన విద్యార్థులతో హెచ్‌ఎంలు

సారంగాపూర్: బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులకు శనివారం ఐసీడీఎస్ అధికారులు సర్టిఫికెట్స్ అందజేశారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండల కేంద్రాల్లోని ఉన్నత పాఠశాలల బాలికలకు నెల రోజుల పాటు కంప్యూటర్ శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్స్‌తో పాటు, శానిటరీ ప్యాడ్స్ అందజేశారు. కార్యక్రమంలో ధర్మపురి సీడీపీవో వాణిశ్రీ, హెచ్‌ఎం కిశోర్, సఖి లీగల్ కౌన్సిలర్ లావణ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.